వైఎస్ఆర్

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సభాభవన్‌లో సోమవారం నిర్వహించనున్నామని డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీ పంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునని తెలిపారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవ లను వినియోగించుకోవాలని డిఆర్ఒ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబం ధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'డెంటల్'కు పంటి పోటు!

- నెలల తరబడి అందని సిరామిక్స్, మెటల్స్
- 4 ఏళ్లుగా జెర్కోనియా క్యాప్స్‌కు నిరీక్షణ
- ప్రయివేటు ఆస్పత్రులకు రోగుల పరుగులు
- డిఎంఇ కార్యాలయ నిర్లక్ష్యమే కారణమా!?

జిల్లా రిమ్స్ దంత వైద్యశాల పంటి పోటుతో విలవిలాడుతోంది. దంతాల మూలాల్లో చీము ఏర్పడడం ద్వారా విపరీతమైన నొప్పితో విలవిలాడుతున్న రోగులకు ఉపశమనం లభించడం లేదు. రోగులకు తక్షణ ఉపశమనం నిమిత్తం డెంటల్ కళాశాల ప్రిన్సిపల్ ఎమర్జెన్సీ కేర్ యూనిట్ ఏర్పాటు చేసి సత్వర చికిత్సలు అందించడంలో చొరవ తీసుకుంది. రూట్ కెనాల్ చికిత్స పొందిన అనంతరం దెబ్బతిన్న పంటి భద్రతకు క్యాప్స్ అమర్చడం దగ్గర సమస్య వస్తోంది. నాలుగేళ్లుగా దంత రోగులు జిర్కోనియం క్యాప్స్ ఏర్పాటుకు నోచుకోవడం లేదు. మూడు నెలలుగా సిరామిక్స్, మెటల్స్ కొరత ఏర్పడింది. ఫలితంగా రోగులు ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురించింది. డిఎంఇ కార్యాలయం టెండర్లు పిలిచి కాంట్రాక్టు ఏజెన్సీని ఎంపిక చేసి జిర్కోనియం, సిరామిక్స్, మెటల్స్‌ను సరఫరా చేయడంలో నెలకొన్న నిర్లక్ష్యమే కారణమని తెలిసింది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

డెంటల్ కళాశాల రోజుకు 350 మందికి ఓపి సేవలు అందిస్తోంది. పంటిపుచ్చులు, దంత మూలాలు సమస్యలకు చేయాల్సిన రూట్‌కెనాల్ చికిత్సకు ప్రాధాన్యత పెరిగింది. రాష్ట్రంలో విజయవాడ, కడప జిల్లా కేంద్రాల్లో డెంటల్ ఆస్పత్రులు ఉన్న సంగతి తెలిసిందే. దంత సమస్యలు పెరిగిన నేపథ్యంలో దంత వైద్య కళాశాలకు జిల్లా సరిహద్దు ప్రాంతాలైన నంద్యాల, ఆళ్లగడ్డ, కదిరి, తాడిపత్రి, ధర్మవరం, నెల్లూరు సరిహద్దు ప్రాంతాలైన ఉదయగిరి, అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి, తంబళ్లపల్లి, చిత్తూరు జిల్లాల సరిహద్దుల నుంచి సైతం రోగులు వస్తున్నారు. తీవ్రమైన పంటిపోటుతో విలవిలాడుతున్న రోగులు ఎక్కువగా వస్తున్నారు. రూట్ కెనాల్ చికిత్స, ఎత్తుడు పళ్ల సరిచేయడం, పళ్ల సెట్ల ఏర్పాటు వంటి సమస్యలతో ప్రొస్తొడాంటిక్స్ విభాగానికి రోజుకు 16 నుంచి 70 మంది రోగులు వస్తున్నారు. రోగుల దంతాలకు మూడు దశల రూట్‌కెనాల్ చికిత్స అనంతరం ప్రొస్తొడాంటిక్స్ వైద్యులు క్యాప్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. సిరామిక్స్, మెటల్స్ జిర్కోనియం వంటి మెటీరియల్స్ తయారు చేసి దెబ్బతిన్న పటికి క్యాప్స్‌లు అమర్చాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. రిమ్స్ దంత వైద్యకళాశాల ప్రొస్తొడాంటిక్స్ విభాగం ప్రతి వారమూ ఇండెంట్స్ పెట్టడం పరిపాటిగా మారింది. ఏళ్ల తరబడి జిర్కోనియం వంటి మెటీరియల్స్ రావడం రోగుల నుంచి నిరసనలు ఎదుర్కోవడం షరామామూలుగా మారింది. డిఎంఇ కార్యాలయం కాంట్రాక్టు ఏజెన్సీని ఎంపిక చేసి సకాలంలో మెటీరియల్ పంపించకపోవడంతో విమర్శలకు ఆస్కారం ఏర్పడుతున్నట్లు తెలిసింది. నాలుగేళ్లుగా జిర్కోనియం రకం మెటీరియల్ అందని పరిస్థితి ఏర్పడింది. మూడు నెలలుగా సిరామిక్స్ షేడ్స్, ఇతర మెటీరియల్ అందకపోవడంతో ప్రొస్తొడాంటిక్ విభాగం ఏమిచేయాలో తెలియక తలలు పట్టు కుంటోంది.

ప్రయివేటుకు రోగుల పరుగులు

రిమ్స్ దంత వైద్యకళాశాలలో పంటి క్యాప్స్ లభించడం లేదు. రూట్‌కెనాల్ చికిత్స సహా క్యాప్స్ నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రయివేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. జిల్లా డెంటల్ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో చికిత్స అందని నేపథ్యంలో ఓపి పెరుగుదలపై గణనీయమైన ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా దంత వైద్య కళాశాల ప్రొస్తొడాంటిక్ విభాగానికి రోజుకు పదుల సంఖ్యలో రోగులు వైద్య చికిత్స నిమిత్తం వస్తున్నారు. జిర్కోనియం, సిరామిక్, మెటల్స్ వంటి సదుపాయాలు లేకపోవడంతో ప్రయివేటు వైద్యశాలల బాటపడుతున్నారు. పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పిస్తే 150 నుంచి 200 వరకు ఓపి చేరుకునే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది.

రోగుల నిలువు దోపిడీ

రిమ్స్ డెంటల్ ఆస్పత్రిలో చికిత్స లభించని రోగులను ప్రయివేటు ఆస్పత్రులు బారిన పడి నిలువుదోపిడీకి గురవుతున్నారు. రిమ్స్ డెంటల్‌లో సైతం పంటి నమూనా తయారు చేయడానికి ప్రయివేటు ల్యాబ్‌కు పంపించడం పేరుతో రూ.600 వసూలు చేస్తున్నారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో సిరామిక్ క్యాప్ అమర్చడానికి రూ.3 వేలు నుంచి రూ.4 వేలు వరకు తీసుకుంటున్నారు. జిర్కోనియం క్యాప్ అమర్చడానికి రూ.10 వేలు వసూలు చేస్తున్నారు. మెటల్ క్రౌన్స్ ఏర్పాటు చేయడానికి రూ.2 వేలు, పళ్లసెట్ల ఏర్పాటుకు రూ.20 వేలు నుంచి రూ.30 వేలు, సాధారణ సెట్‌కు రూ.5 వేలు వరకు వసూలు చేస్తున్నారు. డిఎంఇ కార్యాలయం సత్వరమే స్పందించి మెటీరియల్ అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మెటల్ క్రౌన్స్ క్యాప్‌లు అమర్చుతున్నాం

సిరామిక్స్, జిర్కోనియం క్యాప్స్ అందుబాటులో లేని మాట వాస్తవమే. డెంటల్ వైద్యశాల రోగులకు మెటల్ క్రౌన్స్ పళ్ల క్యాప్‌లు ఏర్పాటు చేస్తున్నాం.

- జ్యోత్స్న, డెంటల్ కళాశాల ప్రిన్సిపల్, కడప.

బ్రహ్మసాగర్‌లో పూర్తిస్థాయిలో నీటి నిల్వ

- రూ.452 కోట్లతో కుందూ ఎత్తిపోతలకు కసరత్తు
- 1.20 లక్షల ఎకరాలు సాగులోకి తేవడమే లక్ష్యం
- తెలుగుగంగ సూపరింటెండెంట్ డి.వెంకటరామయ్య

ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌ను మొదటిసారిగా ఆల్‌టైం రికార్డు స్థాయిలో నీటిని నింపాం. ఇందులోభాగంగా రూ.25 కోట్లతో కాల్వల మరమ్మతులను పూర్తి చేయడంపై దృష్టి సారించాం. 1.20 లక్షల ఎకరాలకు సాగు నీటిని అదించడానికి అవకాశాలు సమృద్ధిగా ఉన్నాయి. దీంతోపాటు బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ పరిధిలోని 122 చెరువులకు నీటిని నింపాం. రాబోయే రోజుల్లో మరికొన్నింటిని నింపుతాం. దీనికితోడు జిబిఇ, ఓబిసి పనుల్లో కదలిక నేపథ్యంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. నంద్యాల-కడప జిల్లా సరిహద్దు ప్రాంతంలోని 98 కి.మీ నుంచి 108 కి.మీ వరకు కాల్వల పనుల్ని పూర్తి చేస్తే పూర్తి స్థాయిలో ఆయకట్టు స్థిరీకరణకు అవకాశా లుంటాయని పేర్కొంటున్న తెలుగుగంగ ప్రాజెక్ట్ సూప రింటెండింగ్ ఆఫీసర్ డి.వెంకటరామయ్యతో ముఖాముఖి...

తెలుగుగంగ నిల్వ సామర్థ్యం ఎంత?

బ్రహ్మంసాగర్‌లో తొలిసారిగా ఆల్‌టైం రికార్డుస్థాయిలో 17.2 టిఎంసిల నిల్వ చేశాం. ప్రస్తుతం అనుబంధ రిజర్వాయర్లలో పూర్తిస్థాయిలో జలకళ నెలకొంది.

కాల్వ మరమ్మతుల గురించి చెప్పండి?

నంద్యాల జిల్లాలోని 98 కి.మీ నుంచి కడప జిల్లాలోని 108 కి.మీ వరకు ఏడు కిలోమీటర్ల వ్యవధిలో ఏడు రకాల గండ్లు పడిన సంగతి తెలి సిందే. తాత్కాలిక అవసరాల రీత్యా గండ్లకు కాల్వలోని ఒండ్రుమట్టిని తోసి నప్పటికీ గండ్లు పండే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో తాత్కాలిక మరమ్మతులతో నీటిని నింపగలిగాం. గతంలో రూ.25 కోట్లతో ప్రతిపాదనలు అందజేశాం.

'గంగ' కాల్వ సామర్థ్యం ఎంత?

తెలుగుగంగ కాల్వ ఐదు టిఎంసిల నీటి ప్రవాహ సామర్థ్యాన్ని కలిగి ఉంది. అక్కడక్కడా గండ్లు పడిన నేపథ్యంలో 2,500 క్యూసెక్కులు మాత్రమే సరఫరా అవుతోంది. రిజర్వాయర్‌లోకి నీటి ప్రవాహం చేరుకునే సరికి 1,500 క్యూసెక్కులకు పడిపోతోంది. ఫలితంగా బ్రహ్మంసాగర్ జలాశయం పూర్తిస్థాయి జలకళను సంతరించుకోవడానికి ఎక్కువ సమయం తీసుకుంటోంది.

సాగర్ ఆయకట్టు విస్తీర్ణమెంత?

బ్రహ్మంసాగర్ కింద 1.56 లక్షల ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో 76 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాం. మిగిలిన 60 వేల ఎకరాల ఆయకట్టు ఎస్ఆర్-1, ఎస్ఆర్-2 రిజర్వాయర్లు, ఎడమ, కుడి కాల్వల పరిధిలో ఉంది.

పెండింగ్ పనుల పురోగతి ఎలా ఉంది?

బ్రహ్మంసాగర్ జిబిసి, ఓబిసి ప్రాంతాల్లోని పెండింగ్ పనులు వేగ వంతం చేయాలి. గతంలో ఓబిసి ప్రాంతాల్లోని పెండింగ్ పనుల్ని చేపట్ట డానికి కాంట్రాక్టర్ ముందుకు రావడంతో పనులు పట్టాలకు ఎక్కించాం. కానీ నిధుల చెల్లింపుల సమస్య కారణంగా నిలిచిపోయాయి. జిబిసి కాంట్రాక్టర్ ముందుకెస్తే 50 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది. ఇందులోభాగంగా జిబిసి కింద 20 వేల ఎకరాలు, ఓబిసి కెనాల్ ప్రాంతంలో 10 వేల ఎకరాలు వెరసి 30 వేల ఎకరాల ఆయకట్టు అందుబాటులోకి రానుంది.

లైనింగ్ పనుల పరిస్థితి ఏమిటి?

బ్రహ్మంసాగర్ కుడి కాల్వ 15 కిలోమీటర్లు, ఎడమ కాల్వ 58 కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. రూ.9.7 కోట్లతో ఎడమ కాల్వ లైనింగ్ పనుల్లో 50 శాతంతో నిలిచింది. నాలుగు దఫాలుగా పిలిచిన టెండర్లలో జెకె కన్స్ట్రక్షన్ పనులు దక్కించుకుంది. రూ.10 కోట్లతో కుడి కాల్వ పనులు చేపట్టాల్సి ఉంది. నెలాఖరులోపు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు అవకాశం ఉంది.

లీకేజీ మరమ్మతు పరిస్థితి ఏమిటి?

రూ.25 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. లీకేజీ ప్రాంతాల్లో 36 ఫిల్లర్లను ఏర్పాటు చేయడమైంది. సిడబ్ల్యూసీ, ఇఐఎస్ఐ వంటి నిపుణులు, పోలవరం అథారిటీ నిపుణుల నుంచి అందే సూచనలు, సలహా లను బట్టి ముందుకు వెళతాం. దీంతోపాటు మరో 100 మీటర్లలో చెమ్మ తగిలిన ప్రాంతాన్నీ గుర్తించడమైంది. గ్రౌటింగ్ ప్రక్రియ సహాయంతో చెమ్మను అరికట్టే ప్రయత్నాలు చేపడుతున్నారు.

కుందూ-పెన్నా లిఫ్టు గురించి చెప్పండి?

త్వరలో పనులు చేపడతాం. కుందూ-పెన్నా ఎత్తిపోతలకు రూ. 452 కోట్ల నిధుల కేటాయించడంపై దృష్టి సారించాం. 56 ఎకరాల భూ సేకరణ ఎల్‌ఎ రివ్యూ కూడా చేయడమైంది. అనంతరం ఎత్తిపోతల పనులు ఊపందుకునే అవకాశం ఉంది. ఎత్తిపోతలను పూర్తి చేసిన అనంతరం ఎనిమిది టిఎంసిలను ఎత్తి పోసే అవకాశం ఉంది.

సర్‌ప్లస్ గేట్ పరిస్థితేమిటి?

బ్రహ్మంసాగర్ సర్‌ప్లస్ గేట్ సెంట్రల్ డిజైనింగ్ ఆఫీసర్స్ సర్వే చేసి ప్రతిపాదనలు పంపించాం. డ్రాయింగ్ సెక్షన్ నుంచి అప్రూవల్ లభిం చాల్సి ఉంది.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

తొగటవీర క్షత్రియ భవన్ ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కడప అర్బన్

కడప నియోజకవర్గంలో తొగటవీర క్షత్రియ భవన్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని మంజూరు చేసేందుకు కృషి చేస్తానని కడప ఎమ్మెల్యే మాధవి హామీ ఇచ్చారు. ఆదివారం తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం సంఘం కడప నగర శాఖ ఆధ్వర్యంలో కనుమలోపల్లిలోని 108 శివలింగాల మహాలింగేశ్వర స్వామి సన్నిధిలో కార్తీకమాస వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడుతూ కడప నియోజకవర్గంలో చేనేత భవన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మంజూరు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. తొగటవీర క్షత్రియ కార్పొరేషన్ ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. కడప నియోజకవర్గం నుంచి తొగట వీర క్షత్రియ కార్పొరేషన్‌లో కొందరికి భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. చిన్నప్పటి నుంచి తనకు చేనేత వస్త్రాలు అంటే చాలా అభిమానం అని చేనేత వస్త్రాలు ధరిస్తూ ప్రోత్సహిస్తున్నానని ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేతలను ఆదరించాలని పేర్కొన్నారు. పొగటవీ ర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్షులు కళ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు మాట్లాడుతూ 14 సంవత్సరాలుగా సంఘం తరఫున పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సంఘం నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. మహిళలకు పిల్లలకు, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, టేకూరు సుదర్శన్, పల్లా మురళీ కృష్ణయ్య, చౌడం సూరిబాబు, బొమ్మిశెట్టి చంద్రశేఖర్, ఉప్పు శంకర్, సంగీనాథం ఆంజనేయులు, గోవిందు నాగరాజు, పల్లా బాలచౌడన్న, సుంకర రామచంద్రుడు, సిఆర్ఐ సునీల్ జయంత్ పాల్గొన్నారు.

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్‌ను మినహాయించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్‌ను మినహాయించాలని ఎస్‌టి యు నాయకులు కోరారు. ఆదివారం కడప ఎమ్మెల్యే మాధవికి ఆమె స్వగృహం లో వినతి పత్రం అందజేశారు. ఎస్‌టియు ఆధ్వర్యంలో దాదాపు 100 మంది ఉపాధ్యాయులు జిల్లా అధ్యక్షులు సంగమేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలకొండయ్య నేతృత్వంలో పాఠశాల విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. టెట్ అనేది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు అసంబద్ధమైన చర్యగా పేర్కొన్నారు. 25, 30 సంవత్సరాల వయస్సు గల సీనియర్ ఉపాధ్యాయులను టెట్ రాయ మనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 50 సంవత్సరాల వయస్సు నిండిన ఉపాధ్యాయులను వారు బోధించే సబ్జెక్టు కాకుండా ఇతర సబ్జెక్టుల సిలబస్‌తో కూడిన టెట్ పరీక్ష రాయమనడం తలకు మించిన భారంలా తయారైందని తెలిపారు. జాతీయ స్థాయిలో ఉపాధ్యాయుల హక్కులు కాపాడే ఉపాధ్యాయ ఐక్య సంఘాలు ఇన్ సర్వీస్ టీచర్స్ తరపున సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేశాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ వేసేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇలియాస్ బాష, బాల గంగిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, చంద్రశేఖర్, గంగాధర్, మస్తాన్, బాబు రాజేంద్ర, హరి, నందగోపాల్, రాజ శేఖర్, చెన్నకేశవరెడ్డి, రవిశంకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కుళాయి బాబు,పద్మాకర్ పాల్గొన్నారు.

వన్‌టౌన్ సిఐకి సన్మానం

ప్రజాశక్తి - కడప : కడప నగరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సిఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వై.చిన్న పెద్దయ్యను ఆదివారం స్థానిక 48వ డివిజన్ కృపా కాలనీకి చెందిన న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, బుడగజంగం ప్రెసిడెంట్ డి.శ్రీరాములు, డి.రాజు కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాస్టర్ పి.మహేష్ మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగంలో ప్రజల శాంతి భద్రతల కోసం నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. సిఐ మాట్లాడుతూ మత స్వేచ్ఛకు పేరు గాంచిన కడప నగరంలో అధికారులను గౌరవించి తమ క్షేమం కోసం ప్రార్థనలు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య సభ్యులు పి.రవితేజ, రోజా, శాంతిరాజు, సురేష్ పాల్గొన్నారు.

సిఐని సన్మానిస్తున్న పాస్టర్ పి. మహేష్

పార్టీలో చేరిన వారితో టిడిపి నాయకులు

వైసిపి నుంచి టిడిపిలోకి చేరికలు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

మండల పరిధిలోని ఇప్పపెంట పంచాయతీ-2లో మద్దిమడుగు సుగాలిబిడికి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు దాదాపు 20 కుటుంబాల వారు నాగిరెడ్డిపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు గంధన్ మోహన్ బాబు, పాలగిరి అయ్యవారు ఐటిడిపి దర్బార్‌బాషా ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా బిడికి వాసులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరామని రాజా నాయక్, బాబు నాయక్ ,శీను నాయక్, ముని నాయక్, నాగ ముని నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్పొరేషన్ పరిధిలోని శంకర్, డీలర్ హబీబ్ ఖాన్, రెడ్డి బాషా, జెబీబుల్లాబాషా, నరసింహులు నాయుడు, సురేష్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 50 దేశాల కరెన్సీ ప్రదర్శన

ప్రజాశక్తి- కడప అర్బన్

కరెన్సీ ప్రదర్శనను ప్రారంభిస్తున్న గ్రంథాలయ కార్యదర్శి పవన్ కుమార్

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలో భాగంగా కడప నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాలపై వారం రోజులపాటు పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం జిల్లా గ్రంథా లయ సంస్థ కార్యదర్శి పవన్ కుమార్ కాయిన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. అత్యంత పురాతన మైన అరుదైన దాదాపు 50 దేశాల కరెన్సీ సంబంధించిన నాణేలను విశ్రాంత గ్రంథాలయాధికారి యన్ .రంగనాథ్ సేకరించి ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఈస్ట్ ఇండియా కంపెనీ జార్జ్ ఎడ్వర్డ్ బ్రిటిష్ కాలం నాటి నాణేలు సుమారు 50 దేశాల కరెన్సీ కాగితాలు కాయిన్స్ ఉన్నాయి. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన జిల్లా అధ్యక్షులు సమీర్ బాష, ఎ.డి. దేవదత్తం సి.మంజుల వాణి, గ్రంథాలయ అధికారులు రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజినీర్స్ ఇన్‌స్టిట్యూషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి -కడప అర్బన్ : హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న ఇంజినీర్స్ ఇన్‌స్టిట్యూట్ కడప లోకల్ సెంటర్‌లో ఆదివారం 36వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో ఎవిఆర్ ఆర్ టెక్నో స్కూల్స్ అధినేత, ఇంజినీర్ ఎ.వెం కటేశ్వర్లును నూతన చైర్మన్‌గా, గౌరవ కార్యదర్శిగా యం.వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. సభ్యు లుగా వై.పి.వెంకటరమణయ్య, బి.వేణుగోపాల్, గంజికుంట గణేష్, వి.పి. ఎస్.కుమార్‌శర్మ, ఆర్. నరేంద్ర రావు, డి.లక్ష్మీపతి, వై.వెంకటరమణ, జి. కృష్ణ కిషోర్, కె.ప్రసాద్, ఎం. షహ నాజ్, టి.లక్ష్మీ భాస్కర్, ఒ.వాసుదేవ రెడ్డి పాలకవర్గ బాధ్యతలు స్వీకరి ంచారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇంజినీర్స్ ఇన్‌స్టిట్యూట్ కడప లోకల్ సెంటర్ అభివృద్ధికి తన శాయశక్తుల కృషి చేస్తానని వాగ్దానం చేశారు. కార్యక్ర మంలో మాజీ చైర్మన్లు, మాజీ గౌరవ కార్యదర్శులు, సభ్యులు, నూతన పాలకవర్గానికి శు భాకాంక్షలు తెలిపారు.

చైర్మన్ ఎ. వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న సభ్యులు

మయోపియా కంటి వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి- కడప అర్బన్

ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారి డాక్టర్ నాగరాజు

ఎల్ విపిఇఐ ఆధ్వర్యంలో మయోపియా కంటి వ్యాధిపై అవగాహన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. కడప జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మాధవీలత అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు రకాల వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలు చేపట్టడం శుభ పరిణామమన్నారు. ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, రాజశేఖర్ రెడ్డి క్యాంపస్ హెడ్ డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి మాట్లాడుతూ పిల్లల నేత్ర సంరక్షణా వారోత్సవం మయోపియా అవగాహన ర్యాలీ ప్రతి సంవత్సరమూ పిల్లల నేత్ర సంరక్షణ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది నెల 10 నుంచి 16వ వరకు పిల్లల నేత్ర సంరక్షణా వారోత్సవాలను నిర్వహించామన్నారు. దేశంలో ముఖ్యంగా పిల్లలలో మయోపియా వేగంగా పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వారోత్సవాల సందర్భంగా అనేక రకాల పోటీలను వినోదాత్మక కార్యక్రమాలను స్థానిక ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల, రాజశేఖర్ రెడ్డి క్యాంపస్ వద్ద నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా రోగులకు, సిబ్బంది పిల్లలకు చిత్రలేఖనం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, వ్యాస రచన పోటీలు, స్కిట్స్ మయోపియా అవగాహన సంభాషణలు వంటి పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. బాలల దినోత్సవాన్ని నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేశామని చెప్పారు. మయోపియ పెరగడానికి కారణం పిల్లల జీవన విధానమే నని, ఎక్కువ సమయం ఇంట్లోనే స్క్రీన్స్ (టీ.వీ/సెల్ ఫోన్) చూస్తూ గడపటం, బహిరంగ ప్రదేశాలలో సూర్యరశ్మిలో ఆడుకోక పోవటం ఒక కారణం అన్నారు. మయోపియా వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే సమర్థవంతంగా చికిత్స ద్వారా నివారించ వచ్చునని చెప్పారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పెంచలయ్య

జోనల్ సిఎంఇని సద్వినియోగం చేసుకోవాలి

- ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ పెంచలయ్య

ప్రజాశక్తి-కడప సిటీ

కడప నగర శివారులలోని ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల ఆవరణంలో ఆదివారం జనరల్ సర్జరీ విభాగం జోనల్ సిఎంఇ కార్యక్రమాన్ని కళాశాలలోని కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ జోనల్ సిఎంఇ కార్యక్రమాలను జనరల్ సర్జరీ విభాగం వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనరల్ సర్జరీ విభాగ ఆధ్వర్యంలో మహిళల్లో వచ్చే వివిధ రొమ్ము సంబంధిత వ్యాధుల గురించి వివరించారు. పలు వైద్య కళాశాల నుంచి వచ్చిన పీజీ వైద్య విద్యార్థులను నిష్ణాతులైన వైద్యులచే అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జనరల్ సర్జరీ హెచ్ఒడి డాక్టర్ వినయ్, జోనల్ సిఎంఇ కో- ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగశ్రీలత పాల్గొన్నారు.

కళాకారులు నైపుణ్యాలతో ముందుకు వెళ్లాలి

ప్రజాశక్తి -కాశినాయన

కళాకారులు నైపుణ్యాలతో ముందుకు వెళ్లి ఐకమత్యంగా ఉండి అభివృద్ధి చెందాలని బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి అన్నారు. పోరుమామిళ్ల పట్టణంలోని మల్లకత్వ సమీపంలో ఉన్న వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బసిరెడ్డి రవీంద్రారెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర నాయకులు ఆయన్ను శాలువాతో సత్కరించి మెమొంటో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులంతా ఏకమై మన పోరుమామిళ్ల ప్రాంతంలో సమావేశం కావడం అభినందనీయమన్నారు. మన ప్రాంతవాసి చెక్కభజన గురువు కందుల రవి కుమార్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. అతని ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా కళా రంగాన్ని నమ్ముకొని చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజల మన్ననలు పొందుతున్నారని చెప్పారు. ఇదే ఉత్సాహంతో కళాకారులంతా ఐకమత్యంగా ఉంటూ ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆకాంక్షించారు. జానపద కళాకారులకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని బసిరెడ్డి రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆయనతోపాటు టిడిపి నాయకులు పోలిరెడ్డి, కృష్ణారెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.



బసిరెడ్డి రవీంద్రారెడ్డిని సన్మానిస్తున్న కళాకారులు

గ్రంథాలయ స్థాపకులకు నివాళులర్పిస్తున్న పాఠకులు

ఉద్యమకారులకు ఘన నివాళి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మైదుకూరు శాఖ గ్రంథాలయంలో పితామహులు, ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు పోలి మేర ఓబన్న మాట్లాడుతూ గ్రంథాలయ పితామహులు, ఉద్యమకారుల వల్ల దేశవ్యాప్తంగా గ్రంథాలయాలు ఏర్పాటయ్యాయయని తెలిపారు. గ్రంథాలయాల వలన కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరికి తెలియజేసి పాఠకులను పెంచే ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, చెన్నారెడ్డి, లక్షుమయ్య, రాజా, సుబ్బారెడ్డి, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

పుస్తకాలు చదువుతున్న పిల్లలు

పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పెరుగుతుంది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పెరుగుతుందని ప్రముఖ రచయిత జింక సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని రామేశ్వరంలోని బాల బాలికల గ్రంథాలయంలో ఆదివారం కథలు చదవడం, ఉపన్యసించడం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానం పెంచుకుంటే గొప్ప వ్యక్తులు కాగలరన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఉమాదేవి, ఉపాధ్యాయుడు రవిబాబు, పిల్లలు పాల్గొన్నారు.

21న హజ్రత్ మదార్ షావలి ఉరుసు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పాపాఘ్ని నది ఒడ్డున వెలిసిన హజ్రత్ జిందేషా మదార్ షావలి ఉరుసు మహోత్సవం రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వా హకులు తెలంగాణ వలి, పీరా సాహెబ్ తెలిపారు. 520 ఏళ్లకు పూర్వం హజ్రత్ సయ్యద్ ఖాజా దర్బార్ జిందేషా మదార్ షావలి అరబ్ దేశం నుండి సన్యాసం, సత్ప్రవర్తన ప్రచారం చేస్తూ వేంపల్లె బిడ్డలపల్లెలోని పాపాఘ్ని నది ఒడ్డున నివాసం ఏర్పాటు చేసుకున్నారన్నారు. 21 శుక్రవారం గంధం, 22న శనివారం ఉరుసు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేంపల్లె, వేముల, చక్రాయపేట, వీరపు నాయునిపల్లె మండలాల హిందు ముస్లింలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బాబు బీడీ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

టెట్ నిబంధనను రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

ఎమ్మెల్యేకు వినతిపత్రమిస్తున్న ఎస్‌టియు నాయకులు

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ అర్హత పరీక్షను రద్దు చేయాలని ఎస్‌టియు నాయకులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కోరారు. ఎమ్మెల్యే స్వగృహంలో ఆదివారం వారు ఎమ్మెల్యేను కలిశారు. ఇందుకు ఎమ్మెల్యే సాను కూలంగా స్పం దించారిన వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టియు. కడప జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పాలకొండయ్య, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ కాడెద్దులు మృతి

ప్రజాశక్తి - కాశినాయన : మండల పరిధిలోని రెడ్డికొట్టల గ్రామానికి చెందిన శివ అనే రైతు ఎడ్లు సగిలేరులో మునిగి మృతి చెందాయి. బాధితుల వివరాల మేరకు.. శివ ఇటీవల రూ.1,70లక్షలతో ఎడ్లు కొన్నాడు. ఆదివారం సేద్యం చేసేందుకు వెళ్లి, ఇంటికి వస్తున్న సందర్భంగా ఎడ్లకు అంటుకున్న బురదను కడిగేందుకు చెన్నవరం సమీపంలోని సగిలేరులో దింపాడు. ఎడ్లు లోపలికి వెళ్లి పోవడంతో శివ ఎంత ప్రయత్నించినా అవి బయటకు తేలక పోయాడు. తను మాత్రం ప్రాణాలతో బయటపడ్డాడు. ఎడ్లు చని పోయాయి. వ్యవసాయమే జీవనంగా ఉంటున్న తన రెండు ఎడ్లు మృతి చెందాయి. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడు ఎస్‌టి కాలనీకి చెందిన దొమ్మర శ్రీనివాసులు (47) ఆదివారం ఉదయం ఇంటి సమీపంలోని వేప చెట్టుకు ఉరివేసుకొని చనిపోయాడు. పోలీసుల కథనం మేరకు.. మృతుడు మద్యానికి బానిసై కడుపునొప్పితో బాధపడుతూ ఉండేవాడు. ఆదివారం నొప్పి ఎక్కువ కావడంతో మద్యం మత్తులో తన ఇంటి సమీపంలోని వేప చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడి తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తిమోతి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఆయన చెప్పారు.

వేధిస్తున్న పారిశుధ్య కార్మికుల కొరత

కుంటుపడుతున్న పారిశుధ్య పనులు - 41వేల జనాభాకు 61 మందే విధులు

విధులకు హాజరవుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీలో రోజురోజుకూ పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. మున్సిపాలిటీలో 24 వార్డులు, 41 వేల జనాభా ఉంది. కేవలం 61 మంది మాత్రమే పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో కూడా పదిమంది అధికారులు రాజకీయ నాయకుల సేవలో కాలయాపన చేస్తున్నట్లు సమాచారం. పట్టణ పరిధిలోని ప్రధాన రహదారుల వెంబడి పారిశుధ్య పనులు చేపట్టేందుకు 18 మంది, ట్రాక్టర్ల వెంట 16 మంది, కంపాక్టర్ వెంబడి 4, ఇంటింటికి చెత్త సేకరణకు 10 మంది, కాలువలలో పూడికతీత పనులు చేయడానికి మరో 10 మంది అందుబాటులో ఉంటున్నారు. అందుబాటులో ఉన్న సిబ్బందికి రోజులో రెండు విడతలగా డ్యూటీలు వేస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విధులకు పంపుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో నివాసాలు అధికంగా ఉండడంతో అందుబాటులో ఉన్న సిబ్బందిపై అధిక భారం పడుతున్నట్లు తెలుస్తున్నది. చెత్త అధికంగా రోడ్లపై చేరుతుండడంతో వీటిని తొలగించడంలో సిబ్బంది విఫలమవుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం సిబ్బంది తక్కువగా ఉండడమేనని పలువురు పేర్కొంటున్నారు. అందుబాటులో ఉన్న సిబ్బందికి ఆరోగ్య, ఇతర వ్యక్తిగత పనుల మీద సెలవులు పెడితే ఉన్న సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోంది. వార్డులో ఐదు మంది సిబ్బందిని ఉంచినా 100 మంది సిబ్బంది అవసరం. అందులో సగం కూడా విధుల్లో లేకపోవడంతో సమస్య తీవ్రంగా ఉన్నట్లు అర్థమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య కార్మికుల సంఖ్యను మరింతగా పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కాలువలలో పూడికతీత పనులు చేపట్టకపోవడం వల్ల వర్షపు నీరు పూర్తిగా రోడ్ల వెంబడి పారుతోంది. మునిసిపాలిటీకి చుట్టూ పక్కల ప్రధాన రహదారుల వెంబడి కాలువలు అన్ని వ్యర్థ పదార్థాలు, మురికితో నిండి ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మున్సిపాలిటీ కార్మికుల సంఖ్యను అవసరం మేరకు నియామకాలు చేపట్టి ప్రజలకు పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధ్వానంగా ఉన్న కడప రోడ్డు నుండి మార్కెట్‌కి వెళ్లే దారి

పన్నులు స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లోనే చెల్లించాలి

పంచాయతీ ఇఒ నాగభూషణంరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని అన్ని రకాల పన్నులు స్వర్ణ పంచాయతీ పోర్టల్ ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి నాగ భూషణంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పన్నులు ఆన్‌లైన్‌లో చెల్లించడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ఇంటి, నీటి పన్నుల కోసం పంచాయతీ సిబ్బంది వచ్చినా ఆన్‌లైన్ విధానంలో చెల్లించడం వలన పంచాయతీ అకౌంట్‌కు నేరుగా జమ అవుతుందన్నారు. పంచాయతీ సిబ్బంది చేతికి మాత్రం డబ్బులు ఇవ్వరాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల ఆర్థిక కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడానికి స్వర్ణ పంచాయతీ పేరుతో డిజిటల్ పోర్టల్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఆయా సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో పన్నులు చెల్లించాలని ఆయన ప్రజలను కోరారు. పాత ఇంటి పన్నులు, నీటి పన్నులు కూడా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. పంచాయతీ సిబ్బంది చేసే అక్రమాలకు ఈ విధానం అడ్డుకట్ట వేస్తుందన్నారు. ప్రజలు మోసపోకుండా ఉండేందుకు వీలుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ఆన్ లైన్‌లో పన్నులు కట్టిన తర్వాత రసీదు కూడా తీసుకోవాలని సూచించారు. ఇంటి పన్నులకు సంబంధించిన అన్ని రకాల పన్నులు ఆన్‌లైన్‌లోనే జమ చేయాలన్నారు. ప్రజల సొమ్ము దుర్వినియోగం కాకుండా ఉంటుందని వివరించారు. ప్రజలు పంచాయతీ సిబ్బంది చేతికి డబ్బులు ఇవ్వకుండా స్వయంగా ఆన్‌లైన్‌లో చెల్లించాలని కోరారు. సిబ్బంది చేతికిస్తే జవాబుదారీ ఉండదని ఇఒ హెచ్చరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి జెండా ఎగురవేస్తాం

టిడిపిలో చేరినవారితో బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

పాత, కొత్త కలయికతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగుర వేస్తామని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గండి రోడ్డులో ఉన్న రాయల్ లాడ్జిలో ఆదివారం టిడిపి నేత మహమ్మద్ షబ్బీర్ ఆధ్వర్యంలో చింతల మడుగుపల్లెకు చెందిన తిప్పారెడ్డి, పొట్టిపాటి మోహన్‌రెడ్డి, శివారెడ్డి, సాదక్‌వలి, బెర్దాలి అబ్దుల్ మాలిక్, గాజులపేటకు చెందిన గంగ నర్సీ బాబు, హుసేన్ ఖాన్‌తో పాటు 50 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో టిడిపి కార్యకర్తలుగా ఉండి కొన్ని కారణాలతో మౌనంగా ఉన్న నాయకులందరూ టిడిపిలో చేరడం సంతోషంగా ఉందన్నారు. పులివెందుల టిడిపి ఎమ్మెల్యేగా గెలవాలంటే 60 వేల ఓట్లను సాధించాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి గెలిస్తే ఎమ్మెల్యే ఎన్నికల్లో సులువుగా ఓట్లు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, హౌసింగ్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, ఎల్‌బిఆర్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఖాజీగా నియామకపత్రం అందజేత

మండలంలోని ముస్లింలకు వివాహాలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మౌలానా అబ్దుల్ రహమాన్‌ను ఖాజీగా నియమించింది. ఆ మేరకు ఆదివారం బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి నియామక పత్రాన్ని మౌలానా అబ్దుల్ రహమాన్‌కు అందజేశారు. ముస్లిం మైనార్టీ సంక్షేమం కోసం చంద్ర బాబు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ముస్లిం మైనార్టీలు టిడిపిని ఆదరించాలి కోరారు. అనంతరం ఖాజీని నియమించినందుకు ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి తాలుకా అధ్యక్షుడు మహబుబ్ బాషా ఆధ్వర్యంలోనే బిటెక్ రవిని, జగన్నాథరెడ్డిని, మహమ్మద్ షబ్బీర్‌ను, రామమునిరెడ్డి, బాలస్వామిరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌పిఎస్ కమిటీ సభ్యుడు హుసేన్ పాల్గొన్నారు.

బీటెక్ రవి చిత్తశుద్ధితో రాజకీయాలు చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

బీటెక్ రవి మీరే నిన్న రైతులకు సొంత నిధులు ఇస్తానని చెప్పావు కదా.. రైతులకు డబ్బులు చెల్లించావా.. రైతులు మిమ్మల్ని నమ్మే పరిస్థితిలో లేరని వైసిపి సింహాద్రిపురం మండలం అధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, అజ్జుగుట్టు భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ సర్వతంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి పేర్కొన్నారు. వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిజంగా రైతులపై చిత్తశుద్ధి ఉంటే ఎందుకు ఈ విషయాన్ని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కంటే ముందుగా కలెక్టర్, ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లలేకపోయారని బిటెక్ రవిని ప్రశ్నించారు. 15 రోజులు గడచినా అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో రైతులతో కలిసి ధర్నా నిర్వహించి సమస్య పరిష్కరిస్తే అవినాష్‌రెడ్డికి మంచి పేరు వస్తుందోననే భయంతో పోలీస్‌లతో అర్ధరాత్రి నోటీస్‌లు ఇప్పించి కార్యక్రమాన్ని అడ్డుకున్నది నిజంకాదాని ప్రశ్నించారు. అయినా రైతుల పట్ల చిత్తశుద్ధితో అవినాష్‌రెడ్డి శాంతియుతంగా పోలీస్ స్టేషన్ వెళ్లి అధికారులతో మాట్లాడి వారం రోజులు గడువు ఇవ్వడంతో ఉక్కిరి బిక్కిరి అయి అధికార పక్షంలో ఉంటూ కలెక్టర్, ఎస్‌పితో మాట్లాడి గంటల్లో రికవరీ చేయించి ఇపించాల్సిన నష్టపరిహారాన్ని కూడా సొంత నిధులు ఇస్తున్నట్లు బిల్డప్‌లు ఇస్తూ రైతుల సమస్యను కూడా రాజకీయం గా పబ్లిసిటీ కి వాడుకొనే దుర్మార్గపు ఆలోచన మీదేనని విమర్శించారు. అధికారంలో లేకున్నా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రైతుల మీద ఉన్న ప్రేమతో రెండున్నర ఎకరాకు రూ.20వేలతో 670 మంది రైతులకు దాదాపు రూ.1.4 కోట్లు సొంత నిధులు ఇచ్చారన్నారు.

మాట్లాడుతున్న దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, వైసిపి నాయకులు

ఎంపీని కలిసిన మాజీ ఎమ్మెల్యే, ముఖ్య అనుచరులు

ఎంపీని కలిసిన మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హైదరాబాదులో కలిశారని మైలవరం మండలం వైసీపీ నేత దొడియం విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆయన 'ప్రజాశక్తి'తో హైదరాబాద్ నుంచి ఫోన్ ద్వారా మాట్లాడుతూ కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని సుధీర్ రెడ్డితోపాటు ముఖ్య నేతలం మర్యాద పూర్వకంగా కలిశామన్నారు. రాజకీయంగా ఎలాంటి చర్చ జరగలేదన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గ భవిష్యత్ కార్యాచరణ తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి చేతిలో ఉందన్నారు. ఎంపీని కలిసిన వారిలో వైసిపి జమ్మలమడుగు పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, నారపురెడ్డి, కృష్ణారెడ్డి, జగదీశ్వరరెడ్డి, లావనూరు నిరంజన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి ఉన్నారని తెలిపారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-రాయచోటి

సివిల్ సర్వీస్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు ఎపి బిసి స్టడీ సర్కిల్ విజయవాడ వారి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి ఆర్. నాగేంద్ర రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 17 నుంచి 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు దారులకు ట్రైనింగ్ టెస్ట్ డిసెంబర్ 5వ తేదీన నిరహిస్తారున్నారు. ఈ టెస్ట్‌లో అర్హత పొందినవారికి డిసెంబర్ 10 నుంచి విజయవాడ నగరం, గొల్లపూడిలోని ఎ.పి బిసి ప్రడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇస్తారున్నారు. సివిల్ సరీప్రెస్ పరీక్షలు రాయడానికి అర్హులైన వారు పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు,బ్యాంక్ పాసు బుక్ నకళ్ళు ఆధార్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో రాయచోటిలో మైనారిటీ ఐటిఐ కాంప్లెక్స్ రాజంపేట రోడ్డులో గల జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి వారి కారాలయము, దరఖాసు చేసుకోవాలన్నారు.మరిన్ని వివరములకు 7989819470, 967669 8175 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

భద్రత వారోత్సవాల్లో పాల్గొన్న యుసిఐఎల్ అధికారులు

ఘనంగా ద్వితీయ భద్రత వారోత్సవాలు

ప్రజాశక్తి - వేముల

మండల పరిధిలోని యుసిఐఎల్ (యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్) తుమ్మలపల్లె మైన్స్‌లో ద్వితీయ వార్షిక భద్రత వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గనుల భద్రత పర్యవేక్షణ అధికారి డి.కిషోర్‌కుమార్, యుసిఐఎల్ టెక్నికల్ డైరెక్టర్ మనోజ్‌కుమార్, ఎస్‌ఎమ్‌ఎస్‌ఐఎల్ డైరెక్టర్ కె.ఆర్.రావు, యుసిఐఎల్ ఐఎస్ఓ హెడ్ డాక్టర్ కేకే రావు, మిల్ జీఎం సుమన్ సర్కార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సేఫ్టీ పతాకావిష్కరణ, భద్రతా ప్రతిజ్ఞ, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభమించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ గనుల్లో ఖనిజం కంటే సురక్షితంగా బయటికి వచ్చే కార్మికుడే అసలు సంపద అన్నారు. భద్రత ప్రాముఖ్యతను వివరించారు. సేఫ్టీ మోడల్స్, భద్రతా నాటికలు, సేఫ్టీ పాటలు, ఫస్ట్‌ఎయిడ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. పనిలో భద్రత పాటిస్తున్న యూనిట్లకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమాన్ని మైన్స్ ఏజెంట్ కిషోర్‌కుమార్ భగత్, మైన్స్ మేనేజర్ బాధవత్ శ్రీను, సేఫ్టీ ఆఫీసర్ మోహన్‌రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో యుసిఐఎల్ భూ సేకరణ అధికారి సిఎస్ఆర్ ఇంచార్జ్ డాక్టర్ బి నవీన్ కుమార్ రెడ్డి, బిసిపీకే నాయక్, కోటేశ్వరరావు, విజయ్‌కుమార్, గౌతమ్ కొల్లూరు, ఎస్‌ఎమ్‌ఎస్ జీఎం జి.ఎస్.రావు, యుసిఐఎల్, ఎస్‌ఎమ్‌ఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కలసపాడు : మహిళల పట్ల భద్రత కలిగి ఉండాలని కలసపాడు ఎస్ఐ తిమోతి తెలిపారు. ఆదివారం మండలంలోని పిడుగుపల్లెలో మహిళలకు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఏ చిన్న సమస్య వచ్చినా శక్తి యాప్, 112కు డయల్ చేస్తే వారి సమస్యను పోలీసులు వచ్చి పరిష్కరిస్తారని చెప్పారు. 24 గంటలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. శక్తి యాప్ ద్వారా తామే అతి తక్కువ సమయంలో మహిళల సమస్యను వారి ఇంటి దగ్గరికి వెళ్లి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అమ్మాయిలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. మోసపూరిత మెసేజ్‌లు నమ్మి మోసపోవద్దన్నారు. ఎవరైనా ఆకతాయిలు వేధింపులు గురి చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. కొత్త వ్యక్తులు గ్రామంలో కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇకమీదట ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండలంలో వారానికి రెండు రోజులు మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహి స్తామని, ఎటువంటి సంఘటనలు చోటు చేసుకున్నా పోలీసులకు తెలియజేయాలన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆహ్లాదరకమైన వాతావరణంలో చల్లని గాలి వేళలో పాలకొండల దగ్గర ఉన్న కడప శిల్పారామంలో సాంస్కృతిక కళావేదిక పైన పద్మాకర్ వారి సహకారంతో కడప నగరానికి చెందిన అఖిల్ డాన్స్ విద్యార్థి విద్యార్థులచే శాస్త్రీయ నృత్యాలు, పల్లె జానపదాలు, సినీ నృత్యాలతో ప్రేక్షకును అల్లరించాయి. చిన్నారులు రామ్మా చిలకమ్మా రామ్మా చిలకమ్మా, రాను బొంబాయికి రాను, గొబ్బియాలో గొబ్బియాలో పాటలకు చిన్నారులు నృత్యాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను శిల్పారామం ఇన్‌ఛార్జి పరిపాలన అధికారి డి. వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు.

పోలీసులు ఏర్పాటు చేసిన డిజిటల్ అరెస్టుపై అవగాహన బోర్డు

డిజిటల్ అరెస్టుపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

అపరిచితుల వ్యక్తుల నుండి ఫోన్ కాల్ ద్వారా వస్తున్న డిజిటల్ అరెస్టులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సిఐ నర్సింహులు కోరారు. ఆదివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు వేంపల్లె అర్బన్ పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో డిజిటల్ అరెస్టుపై అవగాహన పెంచుకోవాలనే బ్యానర్లులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సిఐ నర్సింహులు మాట్లాడుతూ పోలీసులు వాట్సాప్ వీడియో కాల్ చేసి ఇంటరాగేషన్ చేయరని తెలిపారు. అపరిచితుల వీడియో కాల్స్‌కు ప్రజలు స్పదించవద్దని తెలిపారు. అలాంటి నెంబర్లును వెంటనే పోలీసులకు ఇవ్వాలని కోరారు. సిబిఐ, ఎన్ఐఎ, ఈడి, పోలీసు పేర్లు చెబితే భయపడవద్దన్నారు. డిజిటల్ అరెస్టు చట్టంలోనే లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

30న బాలికలకు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈనెల 30న ప్రొద్దుటూరులో ఖేలో ఇండియా అస్మిత లీగ్ జిల్లాస్థాయి అండర్-14, 16 బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘ అధ్యక్ష కార్యదర్శులు బసిరెడ్డి వీర కల్యాణ్‌రెడ్డి, అమర్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనె 30న ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆట స్థలంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా శిక్షణ కేంద్రాలు, జాతీయ అథ్లెటిక్ శిక్షణ శిబిరాలకు ఎంపిక చేస్తారన్నారు. 12ఏళ్లు నిండిన వారు మాత్రమే పాల్గొనాలన్నారు. క్రీడాకారులు ఖేలో ఇండియా అస్మిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. వివరాలకు 99496 86586కు ఫోన్ చేయాలని సూచించారు.

నరకాన్ని తలపిస్తున్న గ్రామీణ రోడ్లు

రోడ్డు దెబ్బతిని కంకర రాళ్లు తేలిన ఉత్సలవరం రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండలం వనిపెంట నుంచి ఉత్సలవరం వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. ఈ దారిని అధికలోడ్‌తో ట్రిప్పర్లు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. వీటి ధాటికి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కంకర రాళ్లు బయటపడడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మార్గాన ఉత్సలవరం, లెక్కలవారిపల్లి, నల్లపురెడ్డిపల్లి, గంజికుంట, తండా గ్రామాల ప్రజలు నిత్యం ప్రయా ణిస్తుంటారు. దెబ్బతిన్న రోడ్డును వీలైనంత త్వరగా బాగు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికే ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు పలుమార్లు రోడ్డు దుస్థితి గురించి వివరించారు. త్వరగా మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చాపాడు : మండల పరిధిలోని చాపాడు-నక్కలదిన్నె రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. పలు ప్రాంతాల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గాన విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి సంబంధించిన లారీలు గ్రావెల్ మట్టితో అధిక లోడుతో ప్రయాణిస్తున్నాయి. రోడ్డు పలు ప్రదేశాల్లో దెబ్బతింది. గుండ్ల వంక మీద కూడా బ్రిడ్జి ప్రమాదకరంగా తయారైంది. కొన్ని ప్రదేశాల్లో పెద్ద గుంతలు ఏర్పడడంతో రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహన దారులు ప్రమాదాల గురవుతున్నారు. ఈ రహదారితోపాటు రామసుబ్బమ్మ కొట్టాలు, కుచ్చుపాప గ్రామాలకు వెళ్లే రహదారి కూడా అధ్వానంగా ఉంది. ఈ రోడ్లు నిర్మించి రెండేళ్లు కూడా పూర్తి కాలేదు. అధిక లోడుతో ప్రయాణిస్తున్న వాహనాలతో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధిక లోడుతో వెళుతున్న వాహనాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రోడ్డుకు ఏర్పడిన పెద్ద గుంతలను పూడ్చి, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నక్కలదిన్నె రోడ్డులో ఏర్పడిన పెద్ద గుంత, దెబ్బతిన్న రామసుబ్బమ్మ కొట్టాలు రోడు

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు

EP No. 43/2024

O.S.No. 308/2011

కూర్తల ఉమామహేశ్వరి **w/o** రామసుబ్బారెడ్డి హిందూ, 58 సం॥ డోర్ నెం.24/553, అప్‌స్టైర్, వసంతపేట, ప్రొద్దుటూరు.

...పిటిషనరు/డిహెచ్ఆర్

Vs

ఊటుకూరు సాదక్‌వలి **s/o** బాబాసాహెబ్, ముస్లిం, 60 సం॥లు, టైలర్, డోర్ నెం. 19/198, జౌకుపాలెం వీధి, రామేశ్వరంపేట, ప్రస్తుతం మహ్మదీయ కాలని, జౌకుపాలెం వీధి, ప్రొద్దుటూరు.

...రెస్పాండెంట్/ జెడిఆర్

021 R 64 NOTICE

పై నెంబరు ఇపిని పిటిషనర్/ డిహెచ్ఆర్ ఇపి షెడ్యూలు దాఖల ఆస్థిని వేలం వేయకోరి దాఖలు చేసి ఉన్నారు. అట్టి ఇపి నందు రెస్పాండెంట్/ జెడిఆర్ అయిన నీకు ఏవైనా ఆక్షేపణలు ఉన్న యెడల **20/11/2025**వ తేదీన స్వయంగా కానీ లాయరుగారి ద్వారా కానీ హాజరై తెలుపుకొనవలెయును. లేనిచో నీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును అని ఇందు వలన తెలియ జేయడమైంది.

షెడ్యూలు

RCC and Rafters two portions house property with site situated in YSR Kadapa District Proddatur Reg district Proddatur sub Reg district. Proddatur muncipality, Jowkupalem street. Rameswaram peta having DNO.19/198.

Boundery by :-

on East : Road, West : Join wall and House fo G. Khader Basha, North : Road, South : Road.

House Measuring :-

East to West : 15 feet
North to South : 60 feet

In site Measuring : -

East to West : 15 feet
North to Sourth 60 feet with all easemint rights market value Rs. 3,00,000/-

HR Dt:- 20/11/2025

//By Order of the Court//

శ్రీ ఎన్.వి. వరప్రసాద్

పిటిషనరు/వాది పరం అడ్వకేట్,
ప్రొద్దుటూరు, కడప జిల్లా.